క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. తొర్రేడు పీఏసీఎస్ (సొసైటీ) ఎరువుల గోడౌన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అలాగే సొసైటీలోని ఎరువుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భీమరాజు పాల్గొన్నారు.

ఏలోహి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సమావేశంలో కేక్ కట్ చేస్తున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక

రాజమహేంద్రవరం రూరల్: లెప్రసీ రోగులకు ఏలోహి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక అన్నారు. బొమ్మూరులోని ఎవాంజికల్ లెప్రసీ కాలనీలో ఏలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రా సుమోయోను, ఏసుదాసు వాక్య సందేశం అందించారు. అనంతరం లెప్రసీ రోగులకు భోజనాల ఏర్పాటు చేశారు. వారికి దుస్తులను జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గన్నవరం తహసీల్దార్ పల్లవి, కాగితాల శ్రీకాంత్, కొనల శుభకర్, ఆనంద్ పాల్ పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

ప్రకాశం నగర్ : మహారాష్ట్రలోని నాందేడ్‌లో మార్చి 21, 22, 23 తేదీల్లో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 3వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఏఐకేఎంఎస్ రాజీ లేని పోరాటం సాగిస్తోందన్నారు. దేశంలో 70 శాతం మంది జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకులు ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ గోయల్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.భాస్కర్, ఎం.ప్రతాప్‌రెడ్డి, టి.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరుని ఆదాయం రూ.1.93 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

ధవళేశ్వరం: గ్రామంలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గడిచిన ఐదు నెలలకు రూ.1,93,743 వచ్చింది. దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీని లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్, నాయకులు పిన్నింటి ఏకబాబు, పన్నాల లక్ష్మీ సంతోషి, యడ్ల వెంకటేష్, పండెళ్ల భాను ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి



స్టార్టప్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ శోభారాణి

కంబాలచెరువు: విద్యార్థులు చదువుతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అలంకరణ చేపల ఉత్పత్తి – అమ్మకం అనే స్టార్టప్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని గురువారం ఉన్నత విద్య కళాశాలల ఆర్‌జేడీ డాక్టర్ ఎస్.శోభారాణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులు ఎలా ఆర్థిక అభివృద్ధి సాధించాలో, కళాశాల స్థాయి నుంచి స్టార్టప్‌లు ఎలా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో జంతుశాస్త్రం విభాగాధిపతి కె.బాబు, కో ఆర్డినేటర్ కె.దుర్గారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్‌నెస్.. సేవలు భేష్

- ప్రభుత్వాస్పత్రిలో వెల్‌నెస్ క్లినిక్
- దీర్ఘకాలిక రోగులకు సేవలు
- ఆహారపు అలవాట్లు, జీవనశైలి పరిశీలన



ప్రభుత్వాసుపత్రిలోని వెల్‌నెస్ క్లినిక్‌లో వైద్య సిబ్బంది

కంబాలచెరువు: అందమైన ఆరోగ్యం దిశగా అడుగులు వేయండని పిలుస్తోంది రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి. మనిషి మనుగడకు, దీర్ఘకాలిక రోగాలకు మన ఆహారపు అలవాట్లే ప్రధాన కారణం. అవి సక్రమంగా ఉంటే దాదాపు సగం రోగాలను శరీరం దరిదాపులకు కూడా రాకుండా చేయవచ్చు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలు, ఇతర వ్యాధులు ఉన్న రోగులు నిత్యం మందులు వాడుతూ ఉండాలి. కొందరు వాటిని నిత్యం వేసుకుంటున్నా ఫలితం కొంత మేరే ఉంటోంది. చివరికి పరిస్థితి చేయి దాటి పోయే విధంగా ముదిరిపోతుంది. దీనికి కారణం ఆ రోగి వేసుకుంటున్న మందులతో పాటు తీసుకునే ఆహారపు అలవాట్లు. ఇది తెలియక చాలామంది మందులు వాడుతూ కూడా రోగాల్ని తగ్గించుకోలేని స్థితిలో ఉంటారు. ఇటువంటి వారందరికీ వైద్య చికిత్సతో పాటు, వారికి మంచి ఆహారపు అలవాట్లు, జీవన శైలి తెలియజేసేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో క్లినిక్ వెల్ నెస్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

చికిత్స కంటే నివారణకే ప్రాధాన్యం

స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఇక్కడ చికిత్స కంటే నివారణకే ప్రాధానమిస్తారు. బీపీ, షుగర్, ఇతర రోగాలతో పాటు జీవనశైలిని మార్చుకోవాలనుకునేవారు ఇక్కడకు వచ్చి సేవలు పొందవచ్చు. ప్రభుత్వాసుపత్రిలోని రూమ్ నెంబర్ 222లో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ క్లినిక్‌లో అసంక్రమిక వ్యాధులైన బీపీ, షుగర్, ఇతర జీవనశైలికి సంబంధించిన వ్యాధులన్నింటికీ పరీక్షలు, చికిత్సలు, ఉచిత సలహాలను అందిస్తారు. అక్కడకు వస్తే డైటీషన్, న్యూట్రీషనిస్టు, కమ్యూనిటీ హెల్త్ విభాగానికి చెందిన ఇద్దరు వైద్యులతో కూడిన బృందం ఓపీకి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు చేస్తారు. వారికి బీపీ, షుగర్ ఏమేర ఉన్నాయి, వాటి వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరిస్తారు.

ప్రతి సోమ, బుధవారాల్లో..

వెల్‌నెస్ సెంటర్‌లో రోగి బరువు, ఇన్సులిన్ ఉత్పత్తి, బీపీ హెచ్చుతగ్గులు వంటి వాటిని పరిశీలిస్తారు. రోగులు ఏ విధమైన ఆహారం తీసుకోవాలి, ఏ విధంగా జీవనశైలిని మార్చుకోవాలో తెలుపుతారు. ఈ సేవలు ప్రతి సోమ, బుధ వారాలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈ క్లినిక్‌కు వచ్చిన వారికి ఒక ఓపీ కార్డు ఇస్తారు. వైద్యులు సూచించిన విధంగా అందులో ఆహారపు తీసుకునే విధానాన్ని రాసిస్తారు. ప్రతి వారం సదరు వ్యక్తి వచ్చినప్పుడు తాము చెప్పిన విధంగా సూచించిన ఆహారపు అలవాట్లతో శరీరంలో వచ్చిన మార్పులను పరిశీలిస్తారు.

సేవలు వినియోగించుకోవాలి



ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ క్లినిక్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. క్లినిక్‌లో అందించే సూచనలతో జీవనశైలిని మార్చుకుని, ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలి. వారంలో రెండు రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. బీపీ, షుగర్, దీర్ఘకాలిక రోగాలున్న వారికి ఈ క్లినిక్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి.

– డాక్టర్ ఎం.సూర్యప్రభ, సూపరింటెండెంట్, బోధనాసుపత్రి, రాజమహేంద్రవరం

కుష్ఠు నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి వసుంధర

రాజమహేంద్రవరం రూరల్: కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర అన్నారు. 2027 నాటికి ఈ వ్యాధిని దేశంలో సమూలంగా అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. స్థానిక లెప్రసీ కాలనీలో గాంధీ చిత్రపటానికి డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో పూలమాల వేసి అంజలి ఘటించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు గాంధీ చేసిన సేవలను స్మరించుకుంటూ గురువారం నుంచి ఫిబ్రవరి 13 వరకూ జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో నివసిస్తున్న 40 మంది కుష్ఠు రోగులకు దుప్పట్లు, పులిహోర ప్యాకెట్లను పాలచర్ల పీహెచ్‌సీ హెచ్‌వీ కుమారి పంపిణీ చేశారు. రామచంద్రపురానికి చెందిన గుణ్ణం రామకృష్ణ చౌదరి 40 స్టీల్ ప్లేట్లు , గ్లాసులు అందజేశారు. విశ్రాంత డీపీఎంవో మానుకొండ డేవిడ్ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు రోహిత, డీఎస్‌ఎంవో ఎం.హారిక, డీపీఎంవోలు, జిల్లా క్షయ, టీబీ, లెప్రసీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి ప్రసన్న కుమార్

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తొర్రేడు పశువైద్యాధికారి డాక్టర్ ఏవీ ప్రసన్న కుమార్ సూచించారు. కాతేరు గ్రామంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వరకూ మండలంలోని పలు గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్స, నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు , వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిబిరంలో 60 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెరుగు రాధాకృష్ణ, వీఎల్‌వో వీర్రాజు, ఏహెచ్‌ఏ డి.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయం



దుప్పట్లు పంపిణీ చేసిన గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: ఇళ్లల్లో పనిచేసే పనివారి భద్రత, వారిని శ్రామికులుగా గుర్తించాలన్న సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయమని స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. నగరంలోని స్వర్ణాంధ్ర సంస్థ ప్రాంగణంలో గురువారం ఇంటి పనివారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, పేదరికం కారణంగా అనేక మంది మహిళలు ఇంటిపనివారుగా మారుతున్నారన్నారు. వారికి కనీస హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి పనిచేసే చోట భద్రత, కనీస హక్కులు కల్పించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఇంటిపనివారి జీవితంలో మార్పునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా ఇంటిపనివారితో సమావేశాలు ఏర్పాటు చేసి, వారికి పనిపై అవగాహన కల్పించడం, యజమానులతో సత్సంబంధాలు, నమ్మకం పొగు చేసుకోవడం, ఆరోగ్య సమస్యల మీద అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 125 మంది ఇంటి పనివార్లకు రూ.వంద చొప్పున నగదు, దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, మీరా కుమారి, గంగాధర్, ధనలక్ష్మి, కొండలరావు, దివ్య, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా ప్రతిభ చూపాలి



విద్యార్థినికి జ్ఞాపిక ప్రదానం చేస్తున్న సీఐ గణేష్

ధవళేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు అన్నింటా ప్రతిభ చూపాలని సీఐ టి.గణేష్ అన్నారు. ధవళేశ్వరంలోని జోషి డ్యాన్స్ అకాడమీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన అకాడమీ విద్యార్థులకు సీఐ టి.గణేష్, డ్రీమ్స్ స్కూల్స్ చైర్మన్ ఎ.రమేష్, జై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సీఈవో వర్రే రమేష్, సినిమా, టీవీ కొరియోగ్రాఫర్ ఎల్. నాని గోపాల్, ఆర్‌డీడీ యూనియన్ ప్రెసిడెంట్ సతీష్ , కొరియోగ్రాఫర్ అభిరామ్ తదితరులు బహుమతులను ప్రదానం చేశారు.

ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు గాంధీ



గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న డీఐ దిలీప్ కుమార్



గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

కంబాలచెరువు: దేశభక్తి, క్రమశిక్షణ, నిరాడంబరత, నైతికత కలిగిన జీవన విధానంతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు గాంధీజీ అని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జరుగుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తరగతుల్లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. సత్యం, అహింస అనే ఆయుధాలతో స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుకు నడిపించిన జాతిపిత, శాంతియుత పోరాట మార్గాన్ని ప్రవచించిన కర్మయోగి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో డి.గౌరీశంకరరావు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి రాజ్ కుమార్, వరహాగిరి కృష్ణమోహన్, పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు నరసింహారావు, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాల సాధనకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: సత్యం, అహింస అనే సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మార్టిన్ లూథర్, రాజమహేంద్రవరం సిటీ ప్రెసిడెంట్ అబ్దుల్లా షరీఫ్, సిటీ వైస్ ప్రెసిడెంట్ పట్నాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



కాపవరంలో మాట్లాడుతున్న జడ్జి ప్రకాశ్ బాబు

మధురపూడి: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో (విధాన్ సే సమాధాన్) గురువారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత సమాజ ప్రగతికి మహిళలే మూలస్తంభాలన్నారు. న్యాయవాది పద్మావతి మాట్లాడుతూ మహిళల సంరక్షణకు అనేక చట్టాలు రూపొందించారన్నారు. వాటి ఆధారంగా మహిళలు హక్కుల సాధనలో ముందుకు సాగాలన్నారు. మరో న్యాయవాది సుజాత మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా అనార్థాలు జరుగుతున్నాయన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్‌పీడీ విజయకుమారి మాట్లాడుతూ చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

సెంట్రల్ జైలుకు మహిళ తరలింపు

కంబాలచెరువు: అప్పు ఇచ్చిన మహిళపై హత్యాయత్నం చేసిన నిందితురాలిని మూడో పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేసి జైలుకి పంపారు. తుమ్మలావకు చెందిన పసగడుగుల పోసమ్మ అదే ప్రాంతానికి చెందిన సత్యవతికి అప్పు ఇచ్చింది. ఆ అప్పు తీర్చకుండానే సత్యవతి హైదరాబాద్ వెళ్లిపోయింది. ఇటీవల తిరిగివచ్చి పోసమ్మకు బాకీ తీర్చేస్తానని నమ్మబలికింది. ఈ క్రమంలో ఆమెను మాటల్లో పెట్టి పీక నులిమి చంపేందుకు ప్రయత్నించింది. చనిపోయిందని భావించి శరీరంపై నున్న బంగారు నగలు తీసుకుని పారిపోయింది. దీనిపై విచారణ వేగవంతం చేసిన పోలీసులు సత్యవతిని చాకచక్యంగా పట్టుకుని కోర్టుకు హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆమెకు రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కంబాలచెరువు: స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బెస్తవీధికి చెందిన అద్దంకి రమణ (52) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రమణకు అప్పుల బాధలు ఉన్నాయి. అతడు బుధవారం అదృశ్యమయ్యాడు. అనంతరం నందనవనం పార్కులో శవమై కనిపించాడు. రమణకు అనారోగ్య సమస్యలు ఉన్నట్లు కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓవర్ లోడ్.. తగ్గని స్పీడ్



అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీ



ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై లారీల నుంచి పడిన ఇసుక



బాలాజీపేట సెంటర్‌లో రోడ్డుపై జారిపడిన ఇసుక


- యథేచ్ఛగా ఇసుక లారీల రాకపోకలు
- పరిమితికి మించి లోడింగ్
- గాలికి ఎగురుతున్న ఇసుక
- వెనుక వచ్చే ప్రయాణికుల అవస్థలు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి గర్భాన్ని తొలి చేస్తూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న అక్రమార్కులు.. వాహన చోదకుల భద్రతను కూడా గాలికి వదిలేస్తున్నారు. వీలైనంత వేగంగా దోచుకుపోవాలనే ఉద్దేశంతో వాహనాలపై పరిమితికి మించి లోడు వేసి తీసుకువెళుతున్నారు. ఇసుక రవాణా చేసే సమయంలో వెనుక వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఇసుకపై మూత వేసి తీసుకువెళ్లాలని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. పరిమితికి లోబడి లోడు చేసిన వాహనాలు వల్ల పెద్దగా ఇబ్బందులు కలగడం లేదు. కానీ పరిమితికి మించి లోడు చేసుకున్న వాహనాల నుంచి దారి పొడవునా ఇసుక జారి పడుతోంది. ఆ లారీ పక్కన, వెనుక వచ్చే ప్రయాణికుల కళ్లలో పడుతోంది. అంతే కాకుండా రోడ్డుపై రాలిన ఇసుక కారణంగా మిగిలిన వాహనాలు జారి పడుతున్నాయి. రాత్రింబవళ్లు యథేచ్ఛగా అధిక లోడు తీసుకువెళుతున్నా పోలీసు, రవాణా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. గత ఐదు రోజులుగా జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పేరిట పోలీసు యంత్రాంగమంతా రోడ్లపైనే ఉంది. హెల్మెట్లు ధరించని, సరైన పత్రాలు లేని వాహన చోదకులకు అపరాధ రుసుం విధించడం, తో కౌన్సిలింగ్ చేయడం తదితర వాటిని నిర్వహిస్తున్నారు. అయితే వీరికి అధిక లోడుతో వెళుతున్న ఇసుక వాహనాలు మాత్రం కనిపించకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షా విధానంపై అవగాహన

ధవళేశ్వరం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్లి మంచి ఫలితాలు సాధించాలని సాధు వెంకట కోటేశ్వరరావు అన్నారు. ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సాధు జనార్దనరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షా విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు పాటించాల్సిన నియమాలను వివరించారు. విద్యార్థుల ప్రవర్తనా శైలి, పరీక్షా విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐడీకేవీ ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి



పోసికుమార్

ధవళేశ్వరం: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన ముత్యాల పోసికుమార్ అన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా , దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఐఎస్ అప్‌డేషన్‌కు నేడే చివరి రోజు

కంబాలచెరువు : టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లో ఉపాధ్యాయుల వివరాలు అప్‌డేట్ చేయడానికి శుక్రవారం ఆఖరి రోజని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఎంఈఓలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల వంటివి టీఐఎస్ వివరాల మేరకే నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికీ అప్‌డేట్ చేయని వారు వెంటనే ఆ పని పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: 33/11 కేవీ మురమండ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ పొట్టిలంక ఫీడర్‌కు కొత్త స్తంభాలు వేసే పనిలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ప్రకటనలో తెలిపారు. వీరవరం గ్రామంలో వ్యవసాయ బోర్లు, గృహాలకు, దామిరెడ్డిపల్లిలో పొట్టిలంక ఫీడర్‌పై ఉన్న వ్యవసాయబోర్లకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

2న మహారోగి ఆరోగ్య కేంద్రం వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలోని కుష్ఠువ్యాధిగ్రస్తుల పునరావాస కేంద్రం 49వ, వివేకానంద చారిటబుల్ క్లినిక్ 24వ వార్షికోత్సవాన్ని ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరగనుంది. ఈ మేరకు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా మంత్రులు వై.సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య తదితరులు హాజరవుతారన్నారు.

అవగాహనతో రహదారి ప్రమాదాలు దూరం

పెదపూడి: రహదారులపై ప్రయాణించే వాహన చోదకులు, విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని అనపర్తి ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. అనపర్తి మెయిన్‌రోడ్డులో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహన చోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాయక్ మాట్లాడుతూ యువకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు నిబంధనలను పాటించాలని సూచించారు.

సినిమాలు



శ్యామల	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	దేవా
సూర్యప్యాలెస్	ప్రేమిస్తావా, మదగజరాజు
స్వామి	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	గేమ్‌చేంజర్
అనుశ్రీ	మదగజరాజు
రాజా	మదగజరాజు
ఊర్వశి	పుష్ప–2
మేనక	మహిష
రంభ	స్కైఫోర్స్
కుమారి	రాచరికం (మార్నింగ్‌షో), పుష్ప–2 (2 షోలు)
అప్సర	డాకు మహారాజ్
అశోక	డాకు మహారాజ్
నామవరం	
వీఎస్ మహల్	సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	సంక్రాంతికి వస్తున్నాం
కడియం	
వెంకటసూర్య	సంక్రాంతికి వస్తున్నాం